ఆగని ఇసుక దందా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, కుంటలు, వాగులు, వంకల్లోని ఇసుకను రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇసుక దందాలో అధికార పార్టీ నాయకులు ఉండడంతో అధికారులు, పోలీసులు సైతం గట్టి చర్యలు తీసుకోలేకపోతున్నారు



పి.జలాలపురంలోని రీచ్‌లో ఇసుక తరలించిన దృశ్యం

శింగనమల: ఇసుక అక్రమ తరలింపుపై పోలీసులు, విజిలెన్స్ అధికారులు, మైనింగ్ అధికారులు దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నా శింగనమల మండలంలోని టీడీపీ నాయకులు ఇసుక దందా మాత్రం ఆపడం లేదు. ఇప్పటికే పలుమార్లు ఇసుక అక్రమ రవాణపై సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, పోలీసులు జేసీబీ, టిప్పర్లు, ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేశారు. కేసులు మమ్మల్ని ఏం చేయలేవని, సంపాదనే కావాలని ఇసుక అక్రమ రవాణా మాత్రం టీడీపీ నాయకులు కొనసాగిస్తున్నారు. శింగనమల మండలంలోని పి.జలాలపురం సమీపంలోని వంకలో నాలుగు రోజులు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. పగలు జేసీబీ పెట్టి ట్రాక్టర్ల ద్వారా డంప్‌కు తరలించడం, అక్కడి నుంచి రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా అక్రమ రవాణ చేయడం చేస్తున్నారు. ఇలా రోజూ రాత్రిళ్లు 20 టిప్పర్లు వరకూ తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణలో టీడీపీ మండల స్థాయి నాయకులు ఉండడంతో, పోలీసులు కూడా దాడులు చేయడానికీ వెనకంజు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఇసుక అక్రమ రవాణపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని పెన్నానదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు అక్రమ ఇసుక తరలింపు నియంత్రణ టీం వెళ్లి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుందన్నారు.

అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నార్పల వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నాం. ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిన వెంటనే ఎంతటివారైనా సరే చర్యలు చేపడుతున్నాం. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లపైన కూడా కేసులు నమోదు చేశాం.

– సీఐ కౌలుట్లయ్య

క్లుప్తంగా

కేజీబీవీకి ఫ్యాన్ల వితరణ

శింగనమల: శింగనమలలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెద్దక్క నాలుగు ఫ్యాన్లు వితరణ చేశారు. బుధవారం పాఠశాల ఎస్‌ఓ గీతరాణికి అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఎంఈఓ నరసింహారాజు మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుని, ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. ఎంఈఓ-2 శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాత గుంతకల్లు వాల్మీకి కల్యాణ మండపంలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయరాం, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ ఢిల్లీశ్వరి తదితరులు గర్భిణులకు పసుపు,కుంకుమ, చీర,గాజులతో పాటు పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డివిజన్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



సాయిబాబా



మురళీకృష్ణ

గుంతకల్లు: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంతకల్లు డివిజన్ నూతన కమిటీ ఏక్రగీవంగా ఎన్నికైంది. గత నెల 14న ఎస్సీ, ఎస్టీ డివిజన్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం ఎన్నిక జరగాలి. పోటీలో ఉన్న పలువురు స్క్రూటీన్‌లో తిరస్కరణకు గురికాగా ప్రస్తుతం కొనసాగుతున్న డివిజన్ కమిటీనే తిరిగి ఎన్నికైంది. గుంతకల్లు డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.సాయిబాబా, ఎం.మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా జీఎస్ కిషోర్‌కుమార్, కోశాధికారిగా నాగరాజునాయక్ ఎన్నికయ్యారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కుల సాధనకై కృషి చేస్తామని కమిటీ నాయకులు పేర్కొన్నారు.

అవార్డుల ఎంపికపై హర్షం

పామిడి: పామిడి పట్టణ, రూరల్ గ్రామాలకు సంబంధించి ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపిక కావడంపై బుధవారం మండలంలోని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు. స్థానిక 5వ వార్డు జెడ్పీహైస్కూల్‌కు చెందిన ఎస్ ప్రిస్కిల్లా (ఎస్‌ఏ-తెలుగు), ఎల్. నాగరాజు (ఎస్‌ఏ-పీడీ), 1వవార్డు, ఎస్‌ఆర్ కాలనీ పాఠశాలల ఎస్‌జీటీలు వీ రంగనాథం, బీ రాణి సంయుక్త, రామగిరి ఎస్‌జీటీ జీ రఫీఉద్దీన్ అవార్డులకు ఎంపికైన వారిలో ఉన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో గురువారం నిర్వహించే గురుపూజోత్సవ కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి సమక్షంలో వారు మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందుకోనున్నారు.

పరిశ్రమలు గ్రామాభివృద్ధికి తోడ్పడాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

పెద్దవడుగూరు: పరిశ్రమలు గ్రామాభివృద్ధి తోడ్పడాలి. కానీ మండలంలోని కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల్లోని మైనింగ్ గనుల యజమానులు గ్రామాభివృద్ధిని విస్మరించారని ఎన్‌జీఓలు అన్నారు. బుధవారం మండలంలోని కొండుపల్లిలో సర్వే నెంబర్ 711/ఎ1, ఏ2, బీ1, బీ2ల్లో 2.630 హెక్టార్లల్లో శ్రీసాయి పూర్ణిమ మైనింగ్ గని నిర్వహణ పై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మైనింగ్ గని నిర్వహణ యజమానులు చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. ప్రజలు, జంతువులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అనంతరం క్రిష్టిపాడు యువకులు మాట్లాడుతూ ఖనిజ సంపదను విక్రయించుకుంటూ డబ్బులను సంపాదించుకుంటున్నా.. ఇంత వరకూ యజమానులు గ్రామంలో ఒక్క మంచి పని కూడా చేయలేదని వాపోయారు. గనుల యజమానులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. డీఎమ్‌ఎఫ్ తో గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీఎస్‌ఆర్ బడ్జెట్‌లో నిధులు కేటాయించి మౌలిక వసతులను కల్పించాలన్నారు. అనంతరం గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి ఐఎస్‌ఓ గుర్తింపు రావడంపై స్థానికులు, ఎన్‌జీఓలు హర్షం వ్యక్తం చేస్తూ ఆర్డీఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పర్యావరణం కాలుష్య నియంత్రణ అధికారి కిషోర్‌రెడ్డి, యాడికి తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

బీకేఎస్ సీఐగా కరుణాకర్



బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం సీఐగా కరుణాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీధర్ సత్యసాయి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ధర్మవరం మండలంలో సీఐగా పని చేస్తున్న కరుణాకర్ బీకేఎస్ సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలు పరిరక్షణలో ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండి పనిచేస్తామన్నారు.

టూటౌన్ సీఐగా మస్తాన్



గుంతకల్లు: గుంతకల్లు టూటౌన్ సీఐగా మస్తాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న సీఐ గణేష్‌ను అనంతపురం ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేయగా, కడప ఎస్సీ, ఎస్టీ పోలీసుస్టేషన్‌లో సీఐగా ఉన్న మస్తాన్‌ను గుంతకల్లుకు బదిలీ చేశారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డిని కలిశారు.

యాడికి సీఐగా రామసుబ్బయ్య



పెద్దవడుగూరు: యాడికి రూరల్ సర్కిల్ సీఐగా రామసుబ్బయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లు నుంచి బదిలీపై వచ్చానన్నారు. పెద్దవడుగూరు మండలాల్లోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో జరిగిన కక్షలను మనసుల్లో పెట్టుకుని గ్రామాల్లో గొడవలకు పాల్పడితే సహించబోమన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ రాఘవేంద్రప్ప

గుంతకల్లు రూరల్: గుంతకల్లు రూరల్ ఎస్‌ఐగా రాఘవేంద్రప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రూరల్ ఎస్‌ఐ గా విధులు నిర్వర్తిస్తున్న సురేష్ అనంతపురం ఎస్పీ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆ స్థానంలో ఉరవకొండ నుంచి రాఘవేంద్రప్ప ఇక్కడకు వచ్చారు.

ఘనంగా పౌష్టికాహార మహోత్సవాలు

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు రూరల్/గుత్తి: తాడిపత్రి ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ సాజిదాబేగం తాడిపత్రిలోని హరిజనాడ అంగన్‌వాడీ-1కేంద్రంలో ఈ మహోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవలసిన ఆహార పదార్థాలను వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, లక్ష్మీదేవి, కౌన్సిలర్ వరలక్ష్మీ, కోఆర్డినేటర్ పల్లవి, ఏఎన్‌ఎం సావిత్రి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు మండలంలోని హెల్త్ సబ్‌సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. సీడీపీఓ నాగమణి పౌష్టికాహార లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అలాగే రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పావతి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు అధికారుల వత్తాసు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీతో అందజేసే చిరుధాన్యాల విత్తన పంపిణీలో తెలుగు తమ్ముళ్లకు వ్యవసాయ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. వివరాలు.. మండలంలోని చెన్నంపల్లిలో ఉన్న రైతు సేవాకేంద్రంలో రైతులకు రాయితీతో చిరుధాన్యాల విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. అయితే అధికారులు టీడీపీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి.. ఆ పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి రాయితీ విత్తనాలను మంజూరు చేయడంపై పలువురు రైతులు మండిపడుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు సేవా కేంద్రాలను ఉపయోగించుకోకుండా టీడీపీ నాయకులకు వత్తాసు పలుకుతున్న అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయితీ విత్తనాలు రైతు సేవా కేంద్రంలో మంజూరు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

గుంతకల్లు: వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో వరద బాధితులకు అండగా నిలుద్దాం అంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వరదల్లో లక్షలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సేకరించిన నిత్యావసర సరుకులు, దుస్తులు ఇతరత్ర వస్తువులు తీసుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా కౌంటర్లు ఏర్పాటుకు కలెక్టర్లు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బి.మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాముడాయల్ పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో అధిక దిగుబడులు

గార్లదిన్నె: రైతులు వరిలో తూర్పు, పడమర కాలిబాటలు తీయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శైలజ సూచించారు. బుధవారం మండలంలోని కల్లూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీ మాట్లాడుతూ రైతులు వరిలో నారు దశలో క్లోరిపైరిపాస్ ద్రవంలో నారును ముంచి విత్తనశుద్ధి చేయడం వల్ల పంటలకు తెగులు వచ్చే అవకాశం ఉండదన్నారు. అలాగే ఖరీఫ్‌లో వరి లో తూర్పు, పడమర, రబీలో దక్షిణ, ఉత్తరం దిశల్లో కాలిబాటలు తీయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఏఓలు శ్రీనివాసులు, సోమశేఖర్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో ఐదుగురు చిన్నారులకు గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని చిన్నపొలమడ గ్రామంలో బుధవారం కుక్కదాడిలో ఐదుగురు చిన్నారులకు గాయాలయ్యాయి. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న మనోజ్ (6), తన్వీస్(4), కౌసిక్‌రెడ్డి(3)లతో పాటు మరో ఇద్దరిపై కుక్క దాడి చేయడంతో గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో మనోజ్‌కు ఎక్కువ గాయాలు కావడంతో అనంతపురానికి తరలించారు. కాగా దాడి చేసిన కుక్కను గ్రామస్తులు కట్టెలతో కొట్టి చంపారు.

ఊరేగింపు జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ, ఇందూ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో గత 11 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ముగుస్తాయని ఆ కమిటీ పామిడి శాఖ సభ్యులు సూర్యనారాయణ, చంద్రశేఖర్ శ్రేష్టి, శివారెడ్డి, నారపరెడ్డి, వెంకటేశు బుధవారం తెలిపారు. సాయంత్రం శ్రీకృష్ణుని ప్రతిమను వాహనంలో ఏర్పాటు చేసి నిర్వహించే ఊరేగింపులో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

యువకుడికి ఆర్థిక సాయం అందజేత

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లికి చెందిన సుదర్శన్ అనే యువకుడికి జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు బుధవారం ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన జూనియర్ ఎన్టీఆర్ అభిమాని సుదర్శన్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స చేయించుకుని ఇంట్లో ఉన్న విషయం తెలుసుకున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు నరేంద్ర, నాయకుడు తిరుపాలు, గుత్తి పట్టణ అధ్యక్షుడు రాజు గ్రామానికి వెళ్లి సుదర్శన్‌కు రూ.75 వేల విలువ చేసే చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాదిక్, బాల, రామ్మోహన్ పాల్గొన్నారు.

గోమయ వినాయకుడిని పూజిద్దాం



గుంతకల్లులో గోమయ గణపయ్య విగ్రహాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జయరామ్



యాడికిలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్

గుంతకల్లుటౌన్: ఆవుపేడతో తయారు చేసిన గోమయ వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎమ్మెల్యే జయరామ్ పిలుపునిచ్చారు. హరిహర గో సంరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో మొదటిసారిగా ఆవుపేడతో తయారు చేయించి నామమాత్రపు ధరకు వాటిని ప్రజలకు అందించడానికి బుధవారం మున్సిపల్ ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సేవా సమితి అధ్యక్షుడు వంకదారు చందూ మాట్లాడుతూ పీఓపీతో తయారుచేసిన వినాయక ప్రతిమలను పూజించడం వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందన్నారు. గోమయ గణపతిని పూజించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు శివ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను వాడండి

పెద్దవడుగూరు: ప్రజలందరూ మట్టి వినాయకుడి విగ్రహాలను తయారు చేసుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, కాలుష్య నియంత్ర అధికారి కిషోర్ రెడ్డి సూచించాన్నారు. బుధవారం మండలంలోని కొండుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

యాడికి: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ ఈరన్న, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్ సూచించారు. ఈ నెల 7న ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఫైర్, మండల, గ్రామ పంచాయతీ అధికారులతో వారు సమావేశమై చర్చించారు. వారు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, విద్యుత్ ఏఈ రాజారావు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

యాడికి: వినాయక చవితి రోజున మట్టి వినాయకులను పూజిద్దాం..ప్రకృతిని కాపాడుకుందామని ప్యారడైజ్ స్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రసాయనాలతో చేసిన విగ్రహాలను వాడడం వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు.

అనుమతి తప్పనిసరి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య సూచించారు. బుధవారం మండలంలోని కల్లూరులో వినాయక చవితి ఉత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.సీఐ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి తీసుకోవాలన్నారు. మూడు రోజుల తర్వాత వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుపై అవగాహన

పామిడి: పట్టణంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం వినాయ ప్రతిమల మండలపాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.శ్రీధర్‌మూర్తి, సీఐ ఎం.రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణరెడ్డి, ఈఓఆర్డీ బీవీ శశికళ హాజరై మాట్లాడారు. మండలపాల ఏర్పాటుపై తప్పనిసరిగా అనుమతి అవసరమన్నారు. పాదచారులు, వాహనచోదకులకు ఇబ్బందులు కలుగకుండా మండలపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ వినాయక మండలపాల కమిటీ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మాది.. ఏజెన్సీ మాకే ఇవ్వాలి

హెచ్‌ఎంపై టీడీపీ కార్యకర్తల ఝులుం



శింగనమల హైస్కూల్‌లో హెచ్‌ఎంను చుట్టుముట్టిన టీడీపీ కార్యకర్తలు

శింగనమల: మా ప్రభుత్వం ఇది, మా పార్టీ కార్యకర్తలే మధ్యాహ్నం భోజనం చేయాలి, ప్రస్తుతం ఉన్న వారిని తొలగించాలని బుధవారం శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుజాతమ్మపై టీడీపీ కార్యకర్తలు ఒత్తిడి చేశారు. దాదాపు 20 సంవత్సరాలు నుంచి కొంతమంది మహిళలు మధ్యాహ్నం భోజనం వండిపెడుతున్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రావడంతో శింగనమలలోని టీడీపీ కార్యకర్తలు కొందరు మధ్యాహ్నం భోజనం చేసే పాతవారిని తొలగించాలని ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, ఎంఈఓ నరసింహారాజుపై ఒత్తిడి తీసుకువచ్చారు. వారిని తొలగించి, మావారిని పెట్టుకోవాలని , లేకుంటే ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్తామని టీడీపీ కార్యకర్తలు వారితో వాగ్వాదం చేశారు. ఇన్ని రోజుల నుంచి సక్రమంగా పని చేసేవారిని ఎలా తొలగించాలని ఉపాధ్యాయులంటున్నారు. కొత్తగా వచ్చేవారు విద్యార్థులకు సక్రమంగా భోజనం వండకపోతే, ఎవరిది బాధ్యత అని ప్రశ్నిస్తున్నారు. రోజూ హైస్కూల్‌లోకి వచ్చి కొంత మంది టీడీపీ కార్యకర్తలు చేస్తున్న వ్యవహారంపై ఆ పార్టీలోని సీనియర్ నాయకులే విమర్శిస్తున్నారు.

విద్యార్థుల తలరాత మార్చేది ఉపాధ్యాయులే



ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఉత్తమ విద్యా బోధనతో విద్యార్థుల తలరాతలు మార్చి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేది ఉపాధ్యాయులేనని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గంగరాజు అన్నారు. మండలంలోని కసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ తదితరులు మాట్లాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు మనకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తారన్నారు. ఈ సందర్భంగా గుంతకల్లు మున్సిపాలిటీ, మండలంలోని పలు పాఠశాలల్లో ఉత్తమ సేవలను అందజేస్తున్న పలువురు ఉపాధ్యాయులను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డుతో సత్కరించారు.

14వ రోజుకు చేరిన కార్మికుల నిరసన



బీకేఎస్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



కల్లూరులో ర్యాలీ చేస్తున్న సత్యసాయి కార్మికులు

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం బీకేఎస్ మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట 14వ రోజూ వాటర్ సప్‌లై కార్మికులు ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, లక్ష్మిన్న, నాగరాజు పెద్దన్న, నల్లప్ప, విశ్వరూప, నరేష్, విశ్వనాథ్ వలి తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెమండలంలోని కల్లూరులో బుధవారం సత్యసాయి కార్మికులు 14వరోజు నిరవధిక సమ్మె చేశారు. ఈసందర్భంగా కార్మికులు సంజీవరెడ్డి సర్కిల్ నుంచి స్టేట్ బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించారు. వెంటనే జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు ఎన్‌సీసీ తోడ్పాటు

గుంతకల్లు: ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు ఎన్‌సీసీ తోడ్పాటు అందిస్తుందని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌సీసీ ప్రవేశాల ఎంపిక ప్రక్రియ కార్యక్రమాన్ని అనంతపురం ఆరవ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమాండింగ్ ఆఫీసర్ రో డ్రిక్స్ హాజరై ఎంపిక చేపట్టారు. మొత్తం 50 విద్యార్థులు పాల్గొనగా 22 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో బాయ్స్ ఎన్‌సీసీ అసోసియేట్ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ప్రకాష్, గరల్స్ కేర్ టేకర్ అఫీసర్ లాస్య మణెమ్మ, కళాశాల అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ నటరాజ్, కళాశాల పర్యవేక్షకులు రఘు తదితరులు పాల్గొన్నారు.